ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి 2025   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పంట ధరల పతనం

ఇటీవల గుంటూరు మిర్చియార్డులో ధరల పతనంపై రైతులతో మాట్లాడుతున్న నాయకులు

- వ్యవసాయం గిట్టుబాటవ్వక సాగుదారు నష్టాల బాట
- మద్దతు ధరలు, ఇతర సమస్యలపై నేడు గుంటూరులో రైతుల రాష్ట్రవ్యాప్త ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెట్టుబడులు పెరిగి ఒకవైపు.. పంటలకు ధరలు దక్కక మరొకవైపు రైతులు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని అన్ని రకాల పంటలకు ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, కార్పొరేట్ సేద్యం వ్యతిరేకించాలని కోరుతూ రైతు, కౌలురైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక, రైతుకూలీ సంఘాల పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక చుట్టుగుంట సెంటర్‌లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా జరగనుంది. అఖిల భారత రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఈ ధర్నాకు హాజరుకానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ సంఘాల నాయకులు కూడా హాజరు కానున్నారు.

అన్ని పంటలకు మద్దతు ధరల అమలు చట్టం రూపొందించి పార్లమెంటులో ఆమోదించాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ మాఫీ చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని, స్మార్టు మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్ల నిధిని కేటాయించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరింపజేయాలని, 200 రోజుల పనిదినాలను, రూ. 600 కూలి అమలు చేయాలని, మిర్చి రైతులకు క్వింటాళ్ రూ.20 వేల ధరనిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పోలవరం నిర్వాసితులకు వెంటనే పునరావసం కల్పించి ప్రాజెక్టును పూర్తి చేయాలని, కౌలు దారులకు, దేవాలయ భూముల సాగుదారులకు, బంజరు, చుక్కల భూముల సాగు దారులకు గుర్తింపు కార్డులు, రుణాలు, ప్రభుత్వ పథకాలు

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

17 వరకు ప్రజా చైతన్య యాత్రలు

జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యలపై ఈనెల 8 నుండి 17వ తేదీ వరకూ సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు కోరారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. సి.హెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రజాచైతన్య యాత్రలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి దశల వారీగా ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెద్దఎత్తున పెరిగిపోయాయని, మరోవైపు ప్రజలకు ఉపాధి లేక జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయని అన్నారు. వ్యవసాయ రంగం నానాటికి దివాళతీస్తోందని, 60 శాతం మంది జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారని, సేవారంగాలకు,

▶ 2లో

గుంటూరుకు 100 విద్యుత్ బస్సులు

- త్వరలోనే రానున్నాయన్న కేంద్రం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- వాహనాల ఛార్జింగ్‌కు స్థల పరిశీలన - ఎన్‌టిఆర్ బస్టాండ్‌లో సందర్శన

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

త్వరలో 100 విద్యుత్ బస్సులు గుంటూరుకు రానున్నాయని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ బస్సులకు ఒకసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలో మీటర్ల దూరం వరకు ప్రయాణించవచ్చని అన్నారు. పిపిపి పద్ధతిన వైబిలిటీ గ్యాప్ ఇచ్చి కిలోమీటర్‌కు రూ.25 కంటే తక్కువ ఆదాయం వస్తే మిగతా నష్టం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. గుంటూరులోని ఎన్టీఆర్ బస్టాండ్‌ను ఆదివారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఒకేసారి 100 విద్యుత్ బస్సులను నిర్వహించాలంటే ఒక ప్రత్యేకమైన విద్యుత్ ఛార్జింగ్ సదుపాయాలు కావాలని, సుమారు 5 ఎకరాల స్థలంలో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు, ఛార్జింగ్ ప్రాంతాలతో కూడిన కొంత స్థలం అవసరమని, ఇందుకోసం అధికారులతో చర్చించామని తెలిపారు. ఆర్‌టిసి చైర్మన్ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కూడా ఈ అంశంపై చర్చించినట్లు చెప్పారు. ప్రస్తుతం గుంటూరులోని ఎన్‌టిఆర్ బస్టాండ్‌లో ఉన్న గ్యారేజిని మరో ప్రాంతానికి తరలించి ఎలక్ట్రిక్ నిర్వహణ కోసం గ్యారేజి స్థలాన్ని వినియోగించే ఆలోచన ఉందన్నారు. ఖాళీ స్థలాలను ఉపయోగించి ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. మంగళగిరికి కూడా త్వరలో విద్యుత్ బస్సులు వస్తాయన్నారు. అంతకు ముందు ఆయన బస్టాండ్‌లో వసతులన

▶ 2లో

టిడ్కో లబ్ధిదారులు రుణగ్రస్తులయ్యారు

- మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం...
- సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో టిట్కో ఇళ్లను సందర్శన
- నాయకుల ఎదుట ఇబ్బందులను ఏకరువుపెట్టిన నివాసితులు

ప్రజాశక్తి-గుంటూరు

టిడ్కో గృహాల లబ్ధిదారులను ప్రభుత్వాలు రుణగ్రస్తులను చేశాయని, గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం గుంటూరులోని టిడ్కో గృహ సముదాయాలను బాబూరావు, నగర కార్యదర్శి కె.నళినికాంత్, నగర నాయకులు సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ లబ్ధిదారులు బ్యాంకులలో నుండి రూ.2.50 లక్షలు రుణం తీసుకుంటే 15 నుంచి 20 ఏళ్ల కాలంలో దాదాపు రూ.10.50 లక్షలు చెల్లించాల్సి వస్తుందన్నారు. అసలు కంటే వడ్డీనే మూడు రెట్లు అధికంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా టిడ్కో ఇళ్లు ఇస్తామని చేసిన వాగ్దానం అమలు కాలేదన్నారు. ఇప్పటికీ గృహాలు కేటాయించని వారికి తక్షణమే కేటాయించాలని కోరారు. ఇప్పటికే రూ.50 వేలు, రూ.లక్ష డిపాజిట్ చెల్లించి, ఇల్లు దక్కక అద్దె ఇళ్లలో ఉంటూ, వడ్డీ కోసం బ్యాంకర్ల నుండి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకొని లబ్ధిదారుల రుణాలను వడ్డీతో సహా భరించాలని, మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

టిడ్కో ఇళ్ల నివాసితులతో మాట్లాడుతున్న బాబూరావు ఇతర నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం....

సిపిఎం బృందానికి లబ్ధిదారులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఆరు కుటుంబాలకు సరిపడే సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంక్‌ను 16 కుటుంబాలకు సరఫరా చేస్తున్నారని, రోజు మార్చి రోజు,

▶ 2లో

టిడిపి నాయకులకు నిరాశ

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా జిల్లా నేతలకు దక్కని చోటు

- 2 లో

రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.22 (సోమవారం - సాయంత్రం)

సహర్ : 5.03 (మంగళవారం - ఉదయం)

96వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి: కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 96వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బి నవనీతం, ఏ విజయశ్రీ, వి రిబ్కా, ఎం శారద, డి రమణ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అడుగుతుంది భిక్ష కాదని, తమ కష్టార్జితంతో కూడిన సంపద మాత్రమేనని చెప్పారు. ప్రభుత్వాలు గమనించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై సాంబయ్య, వై రమాదేవి, వై యమోషువ, డి మాణిక్యరావు, సిహెచ్ పిచ్చయ్య, ఎస్‌కె బాష, కె హగ్గయ్య, బి దానయ్య, ఆశీర్వాదం, బి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలి : పట్టణానికి చెందిన పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె పురుషోత్తమరావు శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ముత్తిం శెట్టి వారి పాలెం లోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆర్థోపెడిక్ సేవలను డాక్టర్ చేబ్రోలు పవన్ కుమార్, డెంటల్ సేవలను డాక్టర్ దివి చైతన్య, డాక్టర్ కె.హిమజ, ఊపిరి తిత్తుల సమస్యలకు డాక్టర్ దివి శ్రీనిధి, షుగర్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ బి వెంకటేష్, స్త్రీల సమస్యలకు డాక్టర్ ఆర్ఎస్ శతి, డాక్టర్ కె కౌశిక్, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ జె విజయలక్ష్మి, డాక్టర్ డి శారద వైద్య సేవలు అందించారు. శిబిరం అనంతరం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గుత్తి సుబ్రహ్మణ్యం కు వైద్య సేవారతన పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ బందం పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులు రుణగ్రస్తులయ్యారు

(మొదటి పేజీ తరువాయి)

అది కూడా గంట సేపు మాత్రమే నీళ్లు వస్తున్నా యని, మురుగు నీరు వస్తోందని, తాగటానికి ఉపయోగ పడట్లేదని వాపోయారు. తాగటానికి వంటకు డబ్బా నీళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. దాదాపు 4 వేలకుపైగా గృహాలున్న ఇక్కడ సచివాలయం లేదని, రేషన్, పెన్షన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు రావట్లేదని చెప్పారు. ప్రతినెలా ముసలి వాళ్లతో సహా గతంలో తాము నివసించిన ప్రాంతాలకు వెళ్లి పెన్షన్, రేషన్ తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. టిడ్కో గృహాలకు తమను మ్యాపింగ్ చేయాలని కోరినా పట్టించుకోవట్లేదన్నారు. నగరానికి దూరంగా ఉండటం వల్ల పనులు కూడా ఉండట్లేదని, పనుల కోసం నగరంలోకి వెళ్లటానికి రోజుకు రూ.50-100 ఖర్చవుతోందని తెలిపారు. ఇళ్ల కోసం తాము చెల్లించిన డిపాజిట్‌లో సగం తిరిగి ఇస్తామని చెప్పినా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ముళ్ల చెట్లను శుభ్రం చేయించాలని కోరారు. కొందరు డిపాజిట్ చెల్లించినా ఇల్లు కేటాయించలేదని, రిజిస్ట్రేషన్ చేయలేదని, కానీ వడ్డీ కోసం బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమసమస్యలు పరిష్కలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎ.నికల్సన్, లూథర్ పాల్, మస్తాన్‌వలి, కాసింషహీద్, శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, అబ్దుల్ సలీం, నాయుడు పద్మ, సి.పద్మనాభుడు, రంగ పాల్గొన్నారు.

పంట ధరల పతనం

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని, జీడి మామిడి, సుబాబులు, కొబ్బరి తదితర పంటలకు మద్దతు ధరలు అమలు చేయాలని, 60 ఏళ్లు నిండిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేలు పింఛన్లు ఇవ్వాలని, కాలువలు, డ్రెయిన్లు, ఎత్తిపోతల పథకాల మరమ్మతులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్టు అఖిల భారత రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్ తెలిపారు.

2014 నుంచి 2022 మధ్య కాలంలో దేశంలో అప్పుల భారంతో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు లక్షలాది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కనీస మద్ధతు ధరలు కూడా లభించక రైతులు ఏటా ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి, కంది, పత్తి, పొగాకు, పసుపు, శనగ, జొన్న, మొక్కజొన్న, టమోటా, ఉల్లి, కొబ్బరి, జీడి మామిడితో సహా మొత్తం అన్ని పంటలను సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఒక వైపు ప్రకృతి వైపరిత్యాలు, మరో వైపు చీడపీడల ప్రభావం, పంట చేతికి వచ్చే సమయానికి వ్యాపారులంతా కుమ్మక్కై ధరలను తగ్గించేయడం పరిపాటిగా మారింది. గతేడాది ఉన్న మిర్చి ధరలు ఈ ఏడాది సగానికి సగం పడిపోయాయి. మిర్చికి గతేడాది కనీస ధర రూ.18 వేలు, గరిష్ట ధర రూ.27వేల వరకు ఉండగా ఈ ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13,500కి పడిపోయింది. అయితే వ్యాపారులు మాత్రం ఎగుమతులు లేవనే సాకుతో ధరలు తగ్గించారే తప్ప వచ్చిన సరుకును వచ్చినట్టు కొనుగోలు చేయడం వెనుక సిండికేట్ మంత్రాంగం పాత్ర ఉందనే ఆరోపణలు లేకపోలేదు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి రెండు నెలల తరువాత ఎక్కువ ధరకు అమ్ముకోవాలన్న పన్నాగం బాగా పారిందనే చెప్పాలి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ అంశంపై రెండు నెలల క్రితమే దృష్టిసారించి ఉంటే రైతులకు మేలు జరిగేది. పంట చేతికి వచ్చే సరికి అపరాల ధరలు నేలచూపులు చూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో అపరాల ధరలు గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో ఉత్పత్తులు బాగున్నా ఇతర దేశాల నుంచి దిగుమతులతో శనగ, కంది ధరల పతనానికి దారితీసింది. ఆస్ట్రేలియా నుండి శనగ దిగుమతులు, మయన్మార్ నుండి కందుల దిగుమతి వల్ల ఉమ్మడి జిల్లాలో ఈ పంటలను సాగు చేసిన రైతులకు నష్టాలు మిగులుస్తున్నాయి. గత రెండు నెలల కాలంలో శనగ, కంది, మినుము, పెసర ఉత్పత్తులకు క్వింటాళ్‌కు సగటున రూ.3 వేల వరకు ధర తగ్గింది. ఒక వైపు ధరలులేక మరో వైపు నానాటికి పెరిగిపోతున్న సాగువ్యయం వల్ల రైతులకు నిరాశ మిగులుతోంది. గతేడాది ఇదే రోజుల్లో కందులు క్వింటాళ్ రూ.10 నుంచి రూ.12 వేలు పలకగా ఈ ఏడాది ప్రస్తుతం రూ.6500 నుంచి రూ.7500 మాత్రమే పలుకుతోంది. మినుములు, పెసల ధరల పరిస్థితి కూడా గత ఏడాది, ఈ ఏడాది ఇదే పరిస్థితి కొనసాగుతోంది. శనగ ధరలు క్వింటాళ్ గతేడాది రూ.8 వేల వరకు పలకగా ఈ ఏడాది రూ.5 వేలకు తగ్గాయి. గరిష్టంగా అన్ని రకాల అపరాల ఉత్పత్తులకు క్వింటాళ్‌కు రూ.3వేల వరకు తగ్గాయి.

హోల్‌సేల్ మార్కెట్‌లో కొంత ధరలు తగ్గినా రిటైల్ మార్కెట్‌లో ధరలు తగ్గడం లేదు. ధాన్యం కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం రైతుల వద్ద కేవలం 15 శాతం ఉత్పత్తులు కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 12 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా కేవలం 1.30 లక్షల టన్నుల బియ్యంను కొనుగోలు చేశారు. పత్తి సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సిసిఐ కొనుగోలు చేయక రైతులు అల్లాడిపోయారు. వ్యవసాయం గిట్టుబాటయ్యేలా ఉత్పత్తి ఖర్చులు కలుపుకుని ఒకటిన్నర రెట్లు అధికంగా ఉండేలా మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో ఢిల్లీ సరిహద్దులో గత నాలుగేళ్లుగా రైతు సంఘాల నాయకులు వివిధ రూపాల్లో తీవ్రస్థాయిలో ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. ఈ నేపథ్యంలో రైతులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేసేందుకు సోమవారం ధర్నా నిర్వహించనున్నారు.

బసవన్న గ్యాస్ట్రో - లివర్ ఇనిస్టిట్యూట్ వైద్యశిబిరం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ యలవర్తి వరబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని బసవన్న గ్యాస్ట్రో - లివర్ కేర్ సెంటర్ వైద్యులు డాక్టర్ వేమూరి ప్రసన్న కుమార్ అన్నారు. నరసరావుపేట మండలం ఇక్కుర్రులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ యలవర్తి వరబాబు, మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ బొడ్డపాటి పేరయ్య ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న యువ వైద్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్‌ను అభినందించారు. శిబిరంలో పాల్గొన్న గ్రామానికి చెందిన 160 మందికి బిపి, షుగర్, జలుబు, దగ్గు, గ్యాస్ట్రో లివర్ సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గ్యాస్, లివర్ సంబంధిత వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. సంప్రదాయ ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించాలని, ధూమ, మధ్యపానంకు దూరంగా ఉండాలని సూచించారు. రానున్న రోజులలో బసవన్న చారిటబుల్ ట్రస్ట్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు విరివిగా నిర్వహిస్తామన్నారు.

ఇకపై యథావిధిగా గ్రీవెన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్ని వారాలుగా నిలిపివేసిన స్పందన కార్యక్రమం ఇకపై ప్రతిసోమవారం కొనసాగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం ఎదురు చూసే వారు అర్జీలతో రావాలని సూచించారు.

టిడిపి నాయకులలకు నిరాశ

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా జిల్లా నేతలకు దక్కని చోటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా స్థానం పొందేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు టిడిపి నేతల ప్రయత్నాలు ఫలించలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్లు రాని వారు ఎమ్మెల్సీ పదవి ఆశించారు.

మాజీ ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, జంగాకృష్ణమూర్తి, మోపిదేవి రమణరావు, మక్కెన మల్లిఖార్జునరావు, పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఎమ్మెల్యేల కోటాలో అవకాశం కల్పించాలని కోరగా ఉమ్మడి జిల్లాలో ఎవ్వరికీ అవకాశం రాలేదు. వీరితో పాటు అనేక మంది సీనియర్లు కూడా ఎమ్మెల్సీ పదవి కోరుకున్నా వారి విన్నపాలను అధిష్టానం ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. వివిధ జిల్లాలకు చెందిన కావలి గీష్మ, బి.టి.నాయుడు, బీదరవిచంద్రకు అవకాశం ఇవ్వగా జిల్లాలో ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదు. వైసిపిలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్న మోపిదేవి వెంకట రమణరావు ఇటీవల తన పదవికి రాజీనామాచేసి టిడిపిలో చేరారు. మోపిదేవి వదులుకున్న రాజ్యసభ స్థానాన్ని మంత్రి నారా లోకేష్ అనుచరుడు సానా సతీష్‌కు కట్టబెట్టారు. ఇందుకు ప్రతిపలంగా ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ కూడా నేరవేరలేదు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసిపికి రాజీనామా చేసి టిడిపి చేరిన జంగాకృష్ణమూర్తికి ఇటీవల తిరుమల, తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యులుగా నియమించారు. దీంతో ఆయనకు ఈసారి అవకాశం దక్కలేదంటున్నారు. ఎన్నికలప్పుడు పెదకూరపాడు టిక్కెట్ వదులుకున్న కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ఎన్నికల ప్రచారంలోనే చంద్రబాబు అప్పట్లో ప్రకటించారు. పెదకూరపాడులో బాష్యం ప్రవీణ్ విజయం కోసం కొమ్మాలపాటి కృషి చేశారు. ఆయనకు అవకాశం రాలేదు. మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి 2023 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే టిడిపికి అనుకూలంగా ఓటు వేసి వైసిపి నుంచి సస్పెండ్ అయ్యారు. ఆమెకు మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. ఇంకా ఎమ్మెల్సీ పదవిని ఆశించిన పలువురు నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చి సర్ది చెప్పారు. ఎమ్మెల్సీ పదవి కోసం గట్టిగా ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యేలకు మాత్రం తీవ్ర నిరాశ మిగిలింది.

17 వరకు ప్రజా చైతన్య యాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక రంగాలకు, విద్య, వైద్య రంగాలకు నిధులు తగినవిధంగా కేటాయించలేదని వివరించారు. కార్మికవర్గం దీర్ఘకాలంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్-6 పథకాలకు బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, స్కీమ్ వర్కర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, పెదవడ్లపూడి హైలెవెల్‌ను పూర్తిచేయాలని, మిర్చి, వరి, పొగాకు, శనగ పంటలకు మద్దతు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న భగత్‌సింగ్ వర్ధంతి సభలు ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, కె.నళినీకాంత్, బి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు డి.శ్రీనివాసకుమారి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

గుంటూరుకు 100 విద్యుత్ బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. బస్టాండ్ పేద వాళ్లకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన రవాణా మార్గమని, ఇలాంటి రవాణా మార్గాన్ని ఆత్యాధునిక సౌకర్యాలతో టాయిలెట్స్, తదితర అవసరాలతో పాటు ఆదాయ మార్గాలకూ అవకాశం కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఆర్టీసీ కార్గో సర్వీసులు కౌంటర్లను పరిశీలించి అక్కడి వినియోగదారులతో మాట్లాడారు. బుకింగ్ సేవలలో ఏదైనా లోపాలుంటే తొలగిస్తామన్నారు. బుకింగ్ కౌంటర్లు తక్కువగా ఉండటం వల్ల బుకింగ్‌లకు ఎక్కువ సమయం పడుతుందని, ఎండల్లో వచ్చేవారు గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ఫిర్యాదు చేశారు. పార్సిల్ సర్వీస్ కాంట్రాక్టర్‌ను మంత్రి పిలిచి అదనపు బుకింగ్ కౌంటర్లను వెంటనే ఏర్పాటు చేయాలని, బుకింగ్ చేసుకోవడానికి వచ్చే ప్రజల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, జిఎంసి డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, ఇడిఇ రవి వర్మ, జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్, గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలియక

45 ఏళ్ల తరువాత ఒకచోటకు చేరి సందడి

1979-1980 సంవత్సరం చదివినం పదో తరగతి పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వారందరు 45 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్నవారు.. అందరూ వివాహాలు చేసుకొని వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డవారు. ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువులమ్మ చెట్టు నీడలో.. అంటూ మాచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1979-1980 పదోవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులందరూ ఒక్క చోట కలిసి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విదార్థుల కలియక జరిగింది. 45 ఏళ్ళ క్రితం స్కూల్లో చదువుకున్న విద్యార్థులు తిరిగి అదే స్కూల్లోని తరగతి గదులల్లో తాము విద్యార్థులగా కూర్చుని పాఠాలు విన్న చోటే కూర్చొని బాల్యపు జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. దేశ, విదేశాలలో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని అప్యాయంగా పలకరించుకున్నారు. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సభలో కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ పులకరించిపోయారు. తీపి జ్ఞాపకలను గుర్తు చేసుకొంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠాలను నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు.

జున్నా శ్రీనివాసరెడ్డి చొరవతో..

న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి చొరవతో పూర్వ విద్యార్థులందరు ఎవరెవరు ఎక్కడ ఉన్నారో కనుగొని వారికి సమాచారం అందించారు. దాంతో వారందరు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో కలిసారు. అలా కలసిన అనంతపురం జిల్లా మలేరియా అధికారి డి. ఓబులు, సింగరేణి కాలరీస్ వైద్యులు డాక్టర్ జె. రవికుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బత్తుల ఏడుకొండలు, విజయనగరం జిల్లా డిప్యూటీ కలెక్టర్ బత్తుల మల్లయ్యలు వివిధ రంగాల్లో ఉన్న గాడిపర్తి రామయ్య, కాలేషా వలి, రంగా సత్యనారాయణ, జ్ఞానరత్నం, నాగార్జునరాజు, రాజ్యలక్ష్మి తమ స్కూల్లో రోజుల్లో ఏ విధంగా ఉండేవారమో, ఎంత అల్లరి చేసేవారో, ఏ టీచర్‌ను ఏ నిక్‌నేమ్‌తో పిలిచేవారో తెలుపుతూ, తమ బాల్య జ్ఞాపకాలన్నీటినీ సభాముఖంగా కుటుంబసభ్యులందరికి తెలియజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించి దివంగతులైన ఆనాటి ఉపాధ్యాయులు, తమతో ఆడుతూపాడుతూ చదువుకొని తమ నుంచి దూరమైన బాల్య మిత్రుల పేర్లను ప్లెక్సీలపై ముద్రించి నివాళులు అర్పించారు. సభ ముగిసిన తరువాత భారమైన హృదయాల్లో వీడ్కోలు చెప్పుకుంటూ తమ కుటుంబ సభ్యులతో తిరగి మరళా కలుద్దామంటూ బైబై చెప్పుకున్నారు.

15న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం లోని ఈ నెల 15న సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఇళ్ళు ఇంటి స్థలం లేని పేదలతో కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు సిపిఐ పల్నా డు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు ఇళ్ళు లేని నిరు పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇంటి నిర్మాణానికి రూ 4లక్షలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్న వారు ఈ నెల 15న అర్జీల తో సహా నరసరావుపేట సిపిఐ జిల్లా కార్యాలయం వద్దకు చేరుకోవాలని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, రాము,శ్రీనివాసరావు, బాబురావు, సిహెచ్ నిర్మల, షేక్ సుభాని, కాల శివయ్య, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్ చిన జాన్ సైదా, దేవి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో.

O.S.No. 43/2024

Between:
1.దొంతిరెడ్డి లోహిత
2.మేడా పద్మావతి
3.బోగిరెడ్డి ఉదయ శంకర శ్రీనివాసరెడ్డి ...వాదులు
And
1.బోగి రెడ్డి రామిరెడ్డి
2.బోగిరెడ్డికృష్ణారెడ్డి ...ప్రతివాదులు.

To,
1) బోగిరెడ్డి రామిరెడ్డి S/o లేటు వెంకటరెడ్డి.
2) బోగిరెడ్డి కృష్ణారెడ్డి S/o లేటు వెంకటరెడ్డి.
Both are residents of near market, Market centre, పొన్నూరు,గుంటూరు జిల్లా.

ఈ నెంబరు దావా లోని వాదులు, ప్రతివాదులు పై షెడ్యూలు ఆస్థిని భాగపంపిణి నిమిత్తం పైన తెల్పిన కోర్టులో దావా చేసి,దావా సమనులు అనేక పర్యాయములు పంపిననూ ఉద్దేశపూర్వకంగా తీసుకొనక తప్పుకొని తిరుగుచున్నంతలో శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు ఈపేపర్ ప్రకటన ద్వారా తెలియ పరచునది ఏమనగా ది.26-3-2025 వ తేదీన ఉదయం 10-30 గంటలకు పైన తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ సమాధానం దాఖలు చేసుకోన వలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానించ బడును.

// శ్రీకోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

వాయిదా తేదీ : 26-03-2025.

కొండూరి నంద కిషోర్,
C.V. ప్రవీణ్ కుమార్,
బాపట్ల వాదులు తరపు అడ్వకేట్స్,
గుంటూరు,
Cell No. 9398470685.

13న వడ్డె రాజుల నూతన కార్యవర్గం ఎన్నిక

వడ్డె రాజుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ వడ్డే రాజుల నూతన కార్యవర్గ ఎన్నిక ఈనెల 13వ తారీకు నాడు నరసరావుపేట రోడ్డులోని వడ్డే బాబన్న విగ్రహం వద్ద ఉన్న కేజీఎన్ కళ్యాణ మండపంలో వినుకొండ నియోజకవర్గ ఐదు మండలాల వడ్డే రాజులు నాయకులు పాల్గొని తమ తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని వడ్డె రాజుల సంఘ పెద్దలు తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వడ్డే రాజులు ఏనుగుపాలెం రోడ్డులోని మిర్చి యార్డ్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. పోటీ నందు వేముల. శ్రీని వాసరావు, చల్లకుమార్, పోటీలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పల్లపు. వెంకటేశ్వర్లు, (మాజీ అధ్యక్షులు) తన్నీరు ఆంజనేయులు,(మాజీ ఏఎంసి డైరెక్టర్) పల్లపు. పున్నయ్య, (మాజీ సెక్రటరీ) ఈర్ల. పిచ్చయ్య, దేవల్ల. ఎరుకలయ్య, కొమ్మర సాంబశివరావు తమ్మిశెట్టి. బాల వెంక ట స్వామి, బత్తుల నరసింహారావు తమ్మిశెట్టి .రామ లింగయ్య, బత్తుల. బాలరాజు, (మాజీ కౌన్సిలర్) దేవర్ల. ప్రసాద్, గుంజి. వాసు, కుంచాల. నాగరాజు, వల్లెపు ప్రసాదు ఇందిరానగర్ బండారు. సాంబయ్య, వేముల. హనుమంతు, బండారు. వీరయ్య, బత్తుల. సుబ్బారావు, కుమేర. నాగార్జున, వల్లెపు. అంకమ్మరావు, సర్పంచ్ బత్తుల నాగరాజు(తిమ్మాయ పాలెం సర్పంచ్) కుంచాల. కొండలు గుంజి. శేషయ్య, బత్తుల. మహంకాళి, కుంచాల. తిరుమల బాబు, బత్తుల. బాలరాజు, బండారు. చిన్న కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన సాగర్‌మాత ఆలయ మహోత్సవాలు

సందేశం ఇస్తున్న చిన్నాబత్తిని భాగ్యయ్య

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయ పురిసౌత్ లో పుణ్య క్షేత్రమైన సాగర మాత ఆలయ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమిష్టి దివ్యబలిపూజా కార్యక్రమానికి గుంటూరు పీఠాధి పతి చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. సాగరమాత రథోత్సవం సాయంత్రం విజయపురిసౌత్ లో ఘనంగా నిర్వహించారు.పురవీధుల్లో గురుపుంగవులు, క్రైస్తవ కన్యలు, ఆలయ పెద్దలు మరియమాత గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు.

1211 కేసుల పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన వివిధ కేసులలో1211 కేసులను శనివారం ఆయా కోర్టులో పరిష్కరించినట్టు ఎస్పి సతీష్‌కుమార్ తెలిపారు. పరిష్కారమైన వాటిలో ఐసిసి కేసులు 601, ఎక్సైజ్ కేసులు 473, స్థానిక చట్టాలకు సంబంధించినవి 133 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులు, బాధితుల పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - మాచర్ల :

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్ అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో చోటుచేసుకొంది. పట్టణంలోని 8వవార్డు రైల్వే కట్ట సమీపంలో నివాసం వుంటున్న అన్నెబోయిన అమరలింగం(40) అయ్యప్ప గుడి వెనుక వైపున వున్న మైదానం నుండి ద్విచక్ర వాహనంపై పట్టణంలోకి వస్తుండగా గుడి సమీపంలో డిసిఎం వాహనం రివర్స్ చేసుకొంటూ రోడ్డుకు అడ్డు రావటంతో వేగంగా వస్తున్న అమరలింగం అకస్మాత్తుగా వచ్చిన వాహనాన్ని తప్పించలేక ఆ వాహనాన్నే ఢీ కొట్టాడు. దాంతో అమర లింగం తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళలు, కళాకారులను సన్మానించిన అతిథులు

గుమ్మడి కళా పీఠం ఆధ్వర్యంలో మహిళా కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి - వినుకొండ

గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు జాషువా కళా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వినుకొండ పట్టణంలో మహిళలకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాషువా కళా ప్రాంగణంలో సంగీత విభావరి నిర్వహించి కళాకారులను మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుమ్మడి కళా పీఠం గౌరవ సలహాదారులు షకీలా, ప్రముఖ న్యాయవాదులు సైదారావు, సిద్దయ్య, పల్నాడు జిల్లా సిపిఐ ఏరియా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మహిళా కళాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. నరసరావుపేట నుంచి వచ్చిన కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షించింది. వందమంది కళాకారులతో పట్టణంలో జరిగిన ర్యాలీ చూపరులను విశేషంగా ఆకర్షించింది.

ఆటో డ్రైవర్‌పై స్నేహితుడి దాడి

ప్రజాశక్తి - తెనాలి

ఆటో డ్రైవర్ పై అతని స్నేహితుడు దాడి చేసిన ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన రాయల మణికంఠ ఆటో నడుపుతుంటాడు. రామలింగేశ్వరపేటలోని ఓ నర్సింగ్ కళాశాలకు ముగ్గురు విద్యార్థులను రోజూ తీసుకెళుతుంటాడు. ఈ ముగ్గురిలో ఒక విద్యార్థినిని తనకు పరిచయం చేయాలని మణికంఠ ను అతని మిత్రుడు నాగుల కోరాడు. దీనికి నిరాకరించడంతో మణికంఠపై నాగుల, అతని స్నేహితుడు ప్రమోద్ దాడికి ప్లాన్ చేసారు. ఆదివారం మణికంఠ ముత్తెశెట్టిపాలెంకు బాడుగకు వెళ్లాడని తెలుసుకుని, దారి కాచి దాడి చేసి గాయపపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డప్పు యువకుడిపై దాడి

ప్రజాశక్తి - తెనాలి

తీన్‌మార్ కొడుతున్న యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన నరసింహ తీన్‌మార్ కొడుతుంటాడు. ఆదివారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతుండగా రామలింగేశ్వరపేటలోని రైస్‌మిల్లు సమీపంలో తీన్‌మార్ ఆపాలంటూ జూపల్లి వంశీ, ప్రమోద్ ఇరువురూ నరసింహతో వాదనకు దిగారు. అంతటితో ఆగకుండ రాయితో అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - క్రోసూరు

దొడ్లేరు గ్రామంలో బోయ కాలనీలో బండి ఏడుకొండలు అనారోగ్యంతో అకస్మాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దకూరపాడు టిడిపి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశానుసారం టిడిపి నాయకులు మొగల్ జాను, మాజీ ఎంపీటీసీ సైదా , చత్తు బుడే, దాచేపల్లి చందు, జనసేన పార్టీ అధ్యక్షులు పూర్ణ ఇంద్రమ్మ శ్రీను, బడే నాగరాజు, కామేపల్లి మాబు సుభాని, శివ నాగేశ్వరరావు, కార్యకర్తలు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఇటీవలే మొగల్ జాను మట్టి ఖర్చులకు 5000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దొడ్లేరు గ్రామంలో ఎవరికీ ఏ సహాయం కావాలన్నా మొఘల్ జాను ముందుంటారు. గ్రామంలో కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే మట్టి ఖర్చుల కోసం, పేద పిల్లల వివాహానికి ఆర్థిక సహాయం చేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్రీడా వేదికకు శంకుస్థాపన చేస్తున్న అర్తిమల్ల రమేష్

పెదకూరపాడు జెడ్‌పి పాఠశాలలో క్రీడా వేదిక ఏర్పాటు

ప్రజాశక్తి - పెదకూరపాడు

తన సతీమణి మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని స్మారకార్థం సొంత నిధులతో పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా వేదిక నిర్మాణ పనులను జిల్లా టిడిపి కార్యదర్శి అర్తిమల్ల రమేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయుడు లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రాయపూడి సాంబశివరావు తనను కలిసి క్రీడా పోటీల నిర్వహణకు, పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందించేందుకు క్రీడా వేదిక ఆవశ్యకతను వివరించి నిర్మాణానికి సహకరించాలని కోరారని తెలిపారు. తాను తక్షణం స్పందించి నిర్మాణ పనులకు స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. క్రీడా వేదిక నిర్మాణానికి అయ్యే రూ.50వేలు ఖర్చు భరించి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు శరవేగంగా సాగుతున్నాయని మార్చి చివరికి వినియోగంలోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా రమేష్ తెలిపారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు

వాణి విద్యానికేతన్ 40వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల :

పట్టణంలోని పీడబ్ల్యుడి కాలనీలోని వాణి విద్యా నికేతన్ పాఠశాల 40వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పాఠశాల హెడ్మాస్టర్ కె.వి.రమణ అధ్యక్షత జరిగిన సభకు ముఖ్య అతిథిగా మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పోలూరి మాట్లాడుతూ ఒక విద్యాసంస్థను నిర్విరామంగా 40 సంవత్సరాలు నడిపిస్తున్న కె.వి.రమణకు అభినందనలు తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ మాట్లాడుతూ విద్యను మించిన ఆస్తి లేదని, విలువలతో కూడిన, క్రమశిక్షణ కలిగిన ఇటువంటి పాఠశాలలో పిల్లలను చదివించడం ద్వారా పిల్లల పురోభివృద్ధికి తోడ్పడిన వారు అవుతారని, తల్లితండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఓ అండ్ ఎం డివిజన్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ సిహెచ్ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గాదే రామకష్ణారావు మాట్లాడుతూ ఇక్కడ చదివిన విద్యార్థులు వారు పెద్దయిన తరువాత అదే పాఠశాలలో వారి పిల్లలను కూడా చదివించడం ఈ పాఠశాల గొప్పతనానికి ప్రతీక అని తెలియపరిచారు. హెచ్ఎం కెవి రమణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థుల తల్లితండ్రులకు కతజ్ఞతలు తెలియజేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను, తల్లిదండ్రులను, విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలి

మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ విఆర్. కృష్ణ తేజ మైలవరపు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలు అవుతున్న వివిధ కార్యకలాపాలపై క్షేత్ర సహాయకులకు ఆదివారం నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ తేజ మాట్లాడుతూ ప్రతి వేతన దారునికి సరాసరి వేతనం రూ 300లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పన, సరాసరి పని దినాల కల్పన, వేతన దారుల హక్కులు, క్షేత సహాయకుల, మేట్‌ల విధులు-బాధ్యతలు, జాబ్ కార్డ్ అందజేయడం, నిర్వ హణ, ఇతర జిజిఐ పెరామీటర్స్ (సుపరిపాలన అంశాలు) ఎన్ఎంఎంఎస్ యాప్ నిర్వహణ, డి-మస్టర్ నిర్వహణ మొదలగు వాటి గురించి వివరించారు. అదేవిధంగా ,ప్రయారిటీ వర్క్స్ అయిన ఫార్మ్ పాండ్స్, ఫిష్ పాండ్స్, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ (టైప్1-2), స్టెప్ వెల్స్ (కోనేరు) పునరుద్ధరణ, రింగ్ ట్రెంచెస్, పెరిఫెరల్ ట్రెంచెస్ మరియు కెనాల్ లైన్ ప్లాంటేషన్ మొదలగు వాటి నిర్మాణంలో ప్రగతి వేగవంతం చేయాలని ఉపాధి హామీ సిబ్బంది అందరూ జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు క్షేత్ర సహాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ కమిషన్ తెలిపిన ముఖ్యమైన పెరామీటర్స్ నందు జిల్లా ప్రగతిని ముందంజలో నిలపాలని సూచించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఫారం పాండ్స్ నిర్మాణం కొరకు గ్రామాలలోని నాయకులతో కలిపి తాము అందరం వియజయవంతంగా చేయటానికి సహకరించాలన్నారు. డైరెక్టర్ ఇ.జి.యస్, వైవికె షణ్ముఖ్ కుమార్, అడిషనల్ కమిషనర్, ఇజిఎస్, మల్లెల శివప్రసాద్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పథక సంచాలకులు ఎం.సిద్ధ లింగ మూర్తి, గురజాల, సత్తెనపల్లి వినుకొండ క్లస్టర్ సహాయ పథక సంచాలకులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - అమరావతి

మహిళా సాధికారతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మహిళలు చైతన్యవంతులై ముందడుగు వేయాలని గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి అన్నారు. అమరావతి మండలంలోని వైకుంటపురం గ్రామంలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జనచైతన్య సమితి కార్యదర్శి,కోలాటం మాస్టారు తుళ్లూరి సాంబశివరావు కోలాటంలో శిక్షణ పొందిన శ్రీకోదండ రామస్వామి కోలాట బందానికి కేంద్ర ప్రభుత్వ గుంటూరు నెహ్రు యువ కేంద్రం సౌజన్యముతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిరణ్మయి మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో ముందుకు వచ్చి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలన్నారు.

కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

ఈకార్యక్రమంలో బాపట్ల ఏరువాక కేంద్రం అసిస్టెంట్ పురమా వరప్రసాద్, పేస్ సొసైటీ అధ్యక్షులు పారుపల్లి రమేష్, సుబ్బిశెట్టి వీరబాబు, కోదండ రామాలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

'పోసాని కస్టడీపై మళ్లీ పిటిషన్ దాఖలు చేస్తాం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట రెండవ పట్టణ పోలీసు స్టేషన్ నమోదైన కేసుకు సంబంధించి సినీ నటుడు పోసాని కృష్ణమురళిని 2 రోజుల కస్టడీకి అను మతి ఇస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇంఛార్జి న్యాయాధి కారి ఆశ్వీరాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పోసాని కృష్ణ మురళిని తీసుకురావడానికి నరసరావు పేట 2వ పట్టణ పోలీసు బందం శనివారం కర్నూలు వెళ్లారు. అప్పటికే విజయవాడ పోలీసులు పీటీ వారెం ట్‌పై పోసానిని అదుపులోకి తీసుకుని అక్కడ స్టేషన్‌కి తరలించారు. దీంతో నరసరావుపేట పోలీసులు వెను దిరిగారు. మళ్లీ పోసాని కస్టడీ కోరుతూ ఈనెల 10న స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని న్యాయాధికారి నిర్ణయం మేరకు కస్టడీ ఉంటుందని రెండో పట్టణ సీఐ హైమా రావు తెలిపారు.

లగడపాడులో ఉపాధ్యాయినులకు సత్కారం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రపంచ మహిళ దినోత్సవ సందర్భంగా పెదకూరపాడు మండలంలోని లగడపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పితృ సౌమ్య నిబంధనలు, పురుషులు ప్రమేయం ఆవశ్యకత వివరించారు. పూర్వ విద్యార్థి చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషులకు ధీటుగా సమైక్య శక్తులుగా, సాహస మూర్తులుగా ఉద్యమించాలని మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదనీ అన్నారు. మరో పూర్వ విద్యార్థి సువర్ణలక్ష్మి మాట్లాడుతూ యత్ర నార్యంతు పూజ్యంతే రమంతే తత్ర దేవత' అని ఆర్యోక్తి అనీ దీనికి అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అనీ, కాని దేవతగా కొలవాల్సిన

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

స్త్రీమూర్తిపై అత్యాచార సంస్కృతి నేటి పరిస్థి తుల్లో ఆందోళన కలిగిస్తోంది అన్నారు. అనంతరం హెడ్మిస్ట్రస్‌ను పాఠశాల పూర్వ విద్యార్థినిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పద్మారావు, లక్ష్మణ, చంద్రం, పుష్పలీల ఆన్నమ్మ, సుశీల, మౌలాలి, యలమంద లక్ష్మణ స్వామి, మహబూబ్ సుభాని, ఫిలిప్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

సీఎం సహాయ నిధి పేదల పాలిట పెన్నిదని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలో 42 మంది లబ్దిదారులకు రూ.58 లక్షల 71 వేల నగదు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసరాలు అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సమితి

బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. మాధవరావు ఆధ్వర్యములో, విద్యా నగర్ 4వ లైన్లో ని చింతలచెర్వు రఘు నివాసంలో 5 కుటుంబములకు, బియ్యం నూతన వస్త్రముల బహుకరించారు. ప్రతి నెలా దాత మహానీయుడు చింతల చెర్వు రాఘవేంద్ర రావు, గాదె రాధిక, బెంగుళూర్ వాస్తవ్యులు బొగ్గరం మార్కెండేయ శర్మ, శేషమ్మ, మూడు కుటుంబములకు తన పేరు చెప్ప వద్దని తన తల్లి దండ్రులు తనకు ఇచ్చిన పాకెట్ మనిని సహాయంగా అందించిన బాలుడి సహాయ సహకారంతో పేద కుటుంబములకు సాయం అంద జేశారు. కార్యక్రమంలో సిహెచ్. భద్రయ్య, ఎం.వి శర్మ ,పి నారాయణ రావు,భువనగిరి సుబ్రహ్మణ్యం, భాగవతుల రవి కుమార్, నాగేశ్వరావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పుటిగంపు సరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పుల్లారావు ప్రారంభించారు. విజయవాడ హెచ్ సి జి క్యాన్సర్ హాస్పిటల్, గుంటూరు హెల్త్ కేర్ హాస్పిటల్, శ్రీకష్ణ ఫ్రీ మెడికల్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ (పాప్ స్విమ్మర్, పిఎస్ఏ, సిఏ 125) (రూ.5 వేల విలువైన పరీక్షలు), గుండె జబ్బులకు సంబంధించి బిపి, షుగర్, ఈసీజీ, టు డి, ఎకో, పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫారుక్‌ఖాన్, డాక్టర్ వినోద్ ఆధ్వర్యంలో 250 మంది శిబిరంలో వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ పుట్టిగంపు వెంకటేశ్వర రావు తెలియజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేటి నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నుండి ప్రతి సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జరుగుతుందని తహశీల్దార్ బి.నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జరుగుతుందని అన్నారు. మండల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయగలరని కోరారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ కట్టమీద ప్రగతి హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి సంబంధించిన వైద్యులు జి గంగాధర్‌రావు, ఆర్ జ్యోతి ప్రకాష్‌రెడ్డి, కె సాయి హితీష్, ఏ అనూష, కె అచ్యుత బాబు, ఎ.రామకృష్ణ, పి నాగమాన్య, కే రంగనాథ్, ఆర్ జ్యోతి అభిషేక్, పి సుజిత్ రవితేజ, టి షణ్ముఖ, కోమలి, ఏ కృష్ణ కిషోర్, బి గోపాలరావు, పి గణేష్, ఎ.అపూర్వ ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. బిపి, షుగర్, కిడ్నీ అల్ట్రా సౌండ్ స్క్రీనింగ్, గుండె ఈసీజీ, ఎకో స్కానింగ్, గుండె, కంటి, మోకాలు, వెన్నెముక, కేన్సర్, మహిళలు, పిల్లలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అవసరమైన వారికి వివిధ రకాల టెస్టుల కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వైద్యశిబిరాన్ని లయన్ గద్దె శేషగిరి, పిఎంజెఎఫ్ జిల్లా గవర్నర్ 316డి ప్రోగ్రాం కమిటీ చైర్ పర్సన్ లయన్ పి సుజాతరావు, లయన్ ఆంజనేయులు, పిఎంజెఇ మొదటి వైస్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ రామిశెట్టి కొండలరావు ప్రారంభించి పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వాలంటీర్ల ద్వారా సక్రమంగా సేవలు అందే విధంగా చూశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వి.కృష్ణయ్య, పిన్నమనేని మురళీకృష్ణ, ఎస్.వెంకట్రావు, పిన్నమనేని విజయ, ఎస్.గిరిజ, సుధా, కొట్టె ప్రభాకర్‌రావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



పంటలకు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పెదనందిపాడు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఉదయం పది గంటలకు గుంటూరులోని చుట్టగుంట సెంటర్ దగ్గర ఉన్న రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు పిలుపునిచ్చారు. ఆదివారం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో శివరావు మాట్లాడుతూ రైతుల పండించిన మిర్చి, శనగ, పొగాకు ధరలు భారీగా తగ్గిపోయి, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్టుబడులు పెరిగి నేపద్యంలో గిట్టుబాటు ధరలు లేకపోవడం అన్యాయం అన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటల భీమా పథకం అమలు చేయాలని, రైతులు, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని, ధరల స్థిరీకరణ నిధికి ఐదు వేల కోట్లు కేటాయించాలని, పాడి రైతులకు లీటర్‌కు ఐదు రూపాయల బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రేపు జరిగే మహా ధర్నాలో రైతు సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, దొప్పలపూడి రమేష్ బాబు పాల్గొన్నారు.

అంగన్వాడీల పట్ల ద్వంద్వ వైఖరి తగదు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు: అంగన్వాడీల పట్ల కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు తమ జీతాల పెంపుదల, ఇతర సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు నిరవధిక సమ్మె నిర్వహించారని, ఆ సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు అంగన్‌వాడీల సమ్మె శిబిరాలలో ప్రత్యక్షంగా పాల్గొని అంగన్వాడీల పోరాటానికి మద్దతు ఇచ్చారని, తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా అంగన్వాడీల జీతాల పెంపుదల విషయం పట్టించుకోకపోగా గత సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలకూ తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ఒప్పందంలో మట్టి ఖర్చులు రూ.20వేలు ఇవ్వాలని ఉంటే రూ.15వేలకు కుదించి జీవో ఇచ్చారన్నారు. రిటైర్మెంట్ సర్వీసు పరిహారం వర్కర్లకు రూ.1.20 లక్షలు హెల్పర్లకు రూ.60 వేలు ఇవ్వాలని ఒప్పందంలో ఉంటే దాన్ని లక్ష రూపాయలకు, రూ.40 వేలకు కుదించి పేరు మార్చి గ్రాట్యుటీ అని పేరుపెట్టి సంబరపడమని చెబుతున్నారన్నారు. మెనూ చార్జీల పెంపుదల, ప్రమోషన్లు తదితర విషయాలపై ఏర్పాటు చేసిన కమిటీని పక్కన పెట్టేశారన్నారు. అంగన్వాడీల జీతాల పెంపుదల ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మార్చి 10వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించబోతున్నట్లు అధికారులు ముందుగానే అధికారులు, మంత్రులు అందరికీ యూనియన్ వినతి పత్రాలు ఇచ్చినా ధర్నాను భగ్నం చేసేందుకు అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా సెక్టార్లవారీగా ట్రైనింగులు ఏర్పాటు చేసి, హాజరు కాకపోతే తీవ్రమైన చర్యలు చేపడతామని హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. యూనియన్ నాయకులను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని సూచిస్తుందన్నారు. అంగన్వాడీలకు ఈలాంటి నిర్బంధాలు కొత్త కాదని, వాటన్నింటినీ అధిగమించి వారు పోరాటం చేయగల సత్తా ఉందని అన్నారు. ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను మానుకొని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు.

సిపిఎం అభిమాని సాంబశివరావు మృతి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్: కాజ గ్రామానికి చెందిన సిపిఎం పూర్వ కార్యకర్త, అభిమాని ఆకురాతి సాంబశివరావు (76) మృతిచెందారు. సింహాద్రి వాసుదేవరెడ్డి, సింహాద్రి శివారెడ్డిలతో సాంబశివరావు కలిసి పని చేశారు. ఎన్నికల సమయాల్లో పార్టీ కార్యాలయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు తన వంతు సహకారాన్ని అందించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. పలవురు నాయకులు సాంబశివరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈదా ప్రతాప రెడ్డి, తమ్మా ప్రసాదరెడ్డి, సత్యమారెడ్డి, ఆదిశేఖర్, యు.తిరుమలస్వామి, డి.నరసింహారావు, కారుమూరు గోపాలరెడ్డి, గాదె మాధవరెడ్డి, సింహాద్రి రామిరెడ్డి, గాదె గోపాలరెడ్డి, ఈదా బ్రహ్మారెడ్డి, పెరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ నీరజ

ముందస్తు జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్ నివారణ

ప్రముఖ న్యూరాలజిస్ట్ నీరజ

ప్రజాశక్తి-గుంటూరు: ముందస్తు జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్ నివారణ సాధ్యమని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో బ్రెయిన్ స్ట్రోక్, నరాల సంబంధిత వ్యాధుల సమస్యలపై ఆమె ప్రసంగించారు. బ్రెయిన్‌స్ట్రోక్ సంభవిస్తే కుటుంబం ఆర్థికంగా చితికిపోవటమే కాకుండా, ఆ కుటుంబం మానసికంగా కుంగిపోతుందన్నారు. మూతి వంకర పోవడం, ఒక వైపు చెయ్యి, కాలు తిమ్మిర్లు, తూలటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఫిజీషియన్‌నుగానీ, న్యూరాలజిస్ట్‌నుగానీ సంప్రదించాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన నాలుగున్నర గంటల్లోపు వైద్యులను సంప్రదిస్తే వెంటనే వైద్యం అందించి, స్వస్థత చేకూర్చే అవకాశం ఉందని చెప్పారు. కాలయాపన చేసే కొద్దీ సమస్య జటిలం అవుతుందన్నారు. నరాలకు సంబంధించిన సమస్యలు గుర్తించినప్పుడు రోగి నడవగలిగే పరిస్థితుల్లో ఉన్నా వైద్యులను సంప్రదించాలని, నడకలో ఇబ్బందిగా ఉన్న వ్యక్తులలో నరాలకు సంబంధించిన వ్యాధులు తగ్గడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. నరాలకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ అరగంట వ్యాయామం చేస్తూ, మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే మంచిదని సూచించారు. 40 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా మధుమేహం, రక్తపోటు లేకపోయినా సంవత్సరానికి ఒకసారి మధుమేహం, రక్తపోటు పరీక్ష చేయించుకుంటే మంచిదని తెలిపారు. ఇటీవల కాలంలో నిల్చొని పనిచేసే వివిధ వత్తుల వారు వెరికోసిల్ వైన్స్ అనే సమస్యకు గురవుతున్నారని, ఈ సమస్యను తొలి దశలోనే గుర్తించి డాక్టర్‌ను సంప్రదించాలని, లేకపోతే కాళ్లకు పుండ్లు ఏర్పడి అవి తగ్గకుండా ఇబ్బందులకు గురి చేస్తాయన్నారు. సభకు టీ.వీ.సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా విశ్రాంత టెలికాం అధికారి వి.రామిరెడ్డి, వాణిజ్యవేత్త కె.కె.నాయుడు పాల్గొన్నారు.



సాయి ఆదిత్య స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక రింగురోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్ 32వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరై మాట్లాడుతూ గత 3 దశాబ్దాలకుపైగా గుంటూరులో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని, విద్యార్థులు అందరూ మంచి ప్రవర్తన, సమాజం పట్ల బాధ్యతగా మెలగటం అలవర్చుకోవాలన్నారు. దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయాలు పాటించి మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు మోదెపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఇన్‌ఛార్జిలు సుబ్బరాయుడు, కృష్ణారావు, కోటినాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చేపలు, మాంసం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్: పట్టణంలో పలు ప్రాంతాల్లో తూనికలు కొలతలు శాఖ అధికారులు ఆదివారం విస్తతంగా తనిఖీలు చేపట్టారు. బుర్రిపాలెం, వహాబ్ రోడ్డు, మఠం బజార్, మారీస్ పేటలోని మాంసం, చేపలు దుకాణాల్లో తూకాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై 11 కేసులు నమోదు చేసినట్లు తెనాలి అసిస్టెంట్ లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ బి శేషసాయి తెలిపారు. తనిఖీల్లో భాగంగా కాలపరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతులు తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు. అంతే కాకుండా తూకంరాళ్లకు తప్పనిసరిగా ముద్రలు వేయించుకోవాలన్నారు. నిర్ణీత గరిష్ట ధరలు కంటే ఎక్కువగా విక్రయించే వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ట్రైనీ ఇన్స్పెక్టర్ జి ప్రసాద్, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి: నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణ మండల వ్యాధులపై జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన నిర్వహించారు. పట్టణ సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రజలు ఉష్ణ మండల ప్రాంతాల్లో ఉండే వ్యాధులైన బోదకాలు డెంగ్యూ,క్షయ, ఎయిడ్స్, మలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించి, ఆయావ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం బోధకాలు వ్యాధిగ్రస్తులకు కిడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేముల ప్రియాంక, చిరసాని ప్రభాకర్‌రెడ్డి, జి.రవికుమార్, జి.శ్యామ్, లేప్రా సొసైటీ నుంచి రమణ, ఎ.బాలచంద్రమౌళి, ఎస్.ఉమాకాంత్, శివ గణేష్ పాల్గొన్నారు.

రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

పేదలకు 'కరెంట్' షాక్...

2 సార్లు నుంచి 3కు పెంచి హోడలెత్తిస్తున్న ఎఫ్.పి. పి.ఎస్.ఎ ఛార్జీలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిన్నటి దాకా ఎఫ్.పి.పి.సి.ఎ చార్జీలు రెండు సార్లు విధించే వారు. జనవరి నుంచి 33 సారి కూడా విధిస్తున్నారు. దానికి తోడు ఫిక్సడ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఇట్లా ఏ నెల్లో ఎంత వస్తుందో తెలియక ఏ నెలకానెల విద్యుత్ బిల్లు ఎంత వస్తుందోనని వినియోగదారులు వణికి పోతున్నారు. పట్టణ, మండల పరిధిలో విద్యుత్ మీటర్లు ఉన్న వారు 60శాతం మంది పేద, నిరుపేద, స్లమ్ ఏరియాలలో నివసిస్తున్న వారే ఎక్కువ. ఒక వైపు సంక్షేమ పథకాలు ఇస్తునే మరో వైపు పేదల నుంచి అందినకాడికి గుంజే ప్రయత్నం చేస్తోంది ప్రభుత్వం. కూటమి అధికారంలోకి వచ్చాక ఉచితాలు మాట అటుంచి విద్యుత్ చార్జీలు మోతమోయ లేక విద్యుత్ వినియోదారులు అల్లాడి పోతున్నారు. దానికి తోడు 22-23, 24,25వ సంవత్సరానికి సంబంధించిన ఇంధన సర్దుబాటు చార్జీలు త్రు ఆఫ్ ఛార్జీలని అనేక రకాల పేర్లతో విద్యుత్ శాఖ హడలెత్తిస్తోందంటున్నారు సామాన్యులు. ఈ ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేస్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్.పి.పి.సి.ఎ) గత సంవత్సరం నవంబర్ నెలలో విద్యుత్ బిల్లులు రెండు సంవత్సరాలవి ఉండగా జనవరి నుంచి ఈ చార్జీలు 3కు పెరిగాయి. ముఖ్యంగా విద్యుత్ చౌర్యం పేరుతో అధికారులు మీటర్లు లేని పేదల ఇళ్లపై విజిలెన్స్ దాడులంటు, విద్యుత్ చౌర్యం పేరిట అదనపు సుంకాలను విధిస్తోంది. విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు చేపడుతోంది. ప్రస్తుతం ఇదంతా అదానీ కోసమేనా.!! అనుకుంటున్నారు. పేదలను సైతం వదల కుండా బలవంతంగా పట్టణంలో 59 మంది నుంచి రూ.3 లక్షల 8 వేలు వసూలు చేశారు. దానికి తోడు స్మార్ట్ మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ పథకానికి ఉరి వేయాలని చూస్తున్నారన్నారనే ఆ రో ప ణ లు న్నా యి. పట్టణ,మండల స్థాయిలో ఉన్న విద్యుత్ కనెక్షన్లలో దాదాపు 60శాతం కనెక్షన్లు నిరుపేదలవే ఉన్నాయి. వీరందరూ దాదాపు రోజువారి కూలీ చేసుకునే వారే. కరెంటు బిల్లు కట్ట లేక పోతుంటే భవిష్యత్తులో మీటర్కిస్తీలుపై అదనపు పన్నులు కట్టాల్సి వస్తే కరెంటుకో దండం ఒక లాంతర్లే ఉత్తమం అంటున్నారు ప్రజలు. ఇప్పటికే స్థిరాదాయం లేక, కుటుంబ పోషణకు సతమతమౌతున్న పేదల పట్ల విద్యుత్ శాఖా ధికారులు వ్యవహరిస్తున్న తీరు మూలిగే నక్కపై తాటికా య పడ్డ చందంగా' మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది..స్మార్టు మీటర్లతో బిల్లుల భయం.. ఎక్కువగా విద్యుత్నుపయోగించే దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల అధికంగా బిల్లులు వస్తున్నాయని యజమానులు వాపోతున్నారు. పాత మీటర్లు ఉన్నప్పుడు ఇంతింత బిల్లులు రాలేదంటున్నారు. స్మార్ట్ మీటర్లు వేగంగా తిరగటం వలన బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని దానికి తోడు అదనపు చార్జీలు మోత మోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులోనైనా స్మార్ట్ మీటర్ల చార్జీలు, ప్రస్తుతం వసూలు చేస్తున్న అదనపు చార్జీలు మొత్తం ఎత్తి వేయాలనీ, కరెంటు చార్జీలు ఏరియాని బట్టి విధించాలని ప్రతి నెల 1వ తారీఖున బిల్లులు తీసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

MIN/ENERGY CHRGS	507.00
FIXED CHARGES	20.00
CUSTOMER CHARGES	50.00
ELECTRICITY DUTY	8.40
INTEREST ON ED	0.00
SURCHARGE	0.00
GRID CHARGES	0.00
SHORT FALL	0.00
OTHER CHARGES	0.00
ADJUSTMENTS	0.00
TRUE-UP (32/36)	0.00
FPPCA Charges (05/22)	67.67
FPPCA Charges (05/23)	51.73
FPPCA Charges (01/25)	38.40
Loss/Gain (+ / -)	-0.20
GOVT SUBSIDY	0.00
BILL AMT	743.00
ARREARS	0.00
TOTAL DUE	743.00
AGL Demand	0.00
ACD Amount	0.00
DueDate/Arr.Pending	24/Mar/2025
DISCONNECTION DATE	09/Apr/2025
LAST PAID :516.00 on	10-02-25

కూలికి వెళ్లి జీవిస్తున్న మాకు కరెంటు బిలు అసలు రూ.7.60 వచ్చింది. పెనాల్టీలు 275.40 పైసలు.... డిశంబర్ దాకా ఎఫ్.పి.పి.సి.ఏ. చార్జీలు రెండుగా వచ్చాయి. జనవరి నెల నుంచి మూడుగా వస్తున్నాయి. ఏమి చేయాలో పాలు పోవటం లేదంటున్నారు...

ఈ బిల్లులో అసలు రూ.507లు అదనపు చార్జీలు రూ. 234 కలిపి బిల్లు మొత్తం 743గా వచ్చింది.... దీనిలో కూడా ఎఫ్.పి.పి.సి.ఏ...జనవరి నుంచి 3 సార్లుకు పెరిగిందంటున్నారు.



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక కష్ణవేణి టాలెంట్ స్కూల్లో పదవతరగతి విద్యార్థుల పెర్వల్ పార్టీ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, రామకష్ణ, శ్రీధర్ గుప్తా, డా.సదాశివ రాజు, వాణి, హరిష్ చంద్ర మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించి, భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం తరపున విద్యార్థులకు పరీక్ష సామగ్రి మరియు షీల్డ్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం వారు, స్కూల్ ఇన్చార్జి లు గౌరీ, నాగజ్యోతి, శ్రీ లక్ష్మీ రెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల అంజయనాయక్ తదితర పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం

రేపు బోటి మీద శ్రీపసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో రేపు బోటిమీద శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తిరునాళ్లని పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అలంకరించారు. గ్రామస్తులు విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఎస్సై ఎం ఉమామహేశ్వరరావు ముందస్తుగా పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మొక్కను నాటుతున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

మొక్కలు నాటే కార్యక్రమం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం ఆవరణలో మానవ సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జరిగింది ఈ కార్యక్రమంలో మానవ సేవా సమితి అధ్యక్షులు పివి సురేష్ బాబుప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్ మాట్లాడుతూ అన్ని మతాల దేవాలయాల దగ్గర మొక్కలు నాటే నాటారని తెలిపారు. సంకల్పంతో మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు.కార్యక్రమంలో మానవ సేవా సమితి ట్రెజరర్ వెంకట్రావు సభ్యులు కరీముల్లా లెక్చరర్ తిరుమల జాబీర్ నాగార్జున హరీష్ చందు అశోక్ ప్రసాదు పాల్గొన్నారు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైభవ్ రెసిడెన్సి అండ్ ఫంక్షన్ హాల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండ వీటి కృష్ణకుమారి, కార్యక్రమ నిర్వాహకురాలు నిమ్మగడ్డ సురేఖలు మాట్లాడుతూ మహిళా సాధికారత సాధిస్తేనే దేశం అగ్రగామిగా రాణిస్తుందని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గాలకు చెందిన మహిళలను గౌరవించాలని, మహిళలు చేసే సేవలకు మనం అందరం ఎప్పుడు రుణపడి ఉంటామని వక్తలు అభిలాషించారు. కార్య క్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ కోసూరి అనంత సునీత, వీణ రంగంలో అనంతమైన కషి సల్పిన రామరాజు లక్ష్మీ శ్రీనివాసు, నరస రావపేట పట్టణంలో ప్రముఖ విద్యా సంస్థ టైనీ టాట్స్ డైరెక్టర్ పాతూరి కోటేశ్వ రమ్మ, స్థానిక సెంటాన్స్ ఉన్నత బాలికల పాఠశాలలో సైన్సు అసిస్టెంట్ మల్లిపెద్ది అరుణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీలు గెలుపొందిన మహిళలకు బహుమతులను అందించారు. కార్యక్రమనికి ముందుగా శ్రీ సత్య సాయి విద్యా విహార్ బాలికలు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆనందింప జేసింది. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, కొండ లీలా శివప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలి, యనమదల వెంకట్రామయ్య, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, తుమ్మల రాధా, కల్పనా దేవి, డాక్టర్ అనురాధ తో పాటుగా రోటరీ క్లబ్ సభ్యులు, జాగతి మహిళా మండలి

మహిళలను సన్మానిస్తున్న అతిథులు

15 ఏళ్లు అధికారంలో ఉంటే రాష్ట్రానికి తిరుగే ఉండదు : పుల్లారావు

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రత్తిపాటి తదితరులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సూపర్6 పథకాల్ని ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుంది. ప్రజల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలన్నదే వైసీపీ తాపత్రయమని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం అన్నారు. గణపవరంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన ఆర్చీని ప్రారంభించి, బస్ షెల్టర్ నిర్మాణానికి శంఖు స్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నుం చి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేయనుందన్నారు. సూపర్ 6 పథకాలన్నీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలుచేసే తీరుతుందని, స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ చేసే విష ప్రచారాన్ని నమ్మ వద్దన్నారు. 15 ఏళ్లు కూటమి ప్రభు త్వం అధికారంలో ఉంటే ప్రజలు కూడా సుఖ సంతోషాలతో జీవిస్తారని తెలపారు. శాశ్వత ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు, దేశాలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయనే దానిపై ప్రజలు కూడా చర్చించు కోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, తెలుగువారి హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్తిపాటి పేరుపేరునా అభినందనలు తెలియచేశారు. గణపవరంలో తెలుగు దేశం పార్టీ చేసిన అభివృద్ధి తప్ప, మరెవరూ చెప్పుకోవడానికి ఏమీ చేయలేదనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రూ.1000కోట్లతో నిర్మించిన బైపాస్ నిర్మాణంతో గణపవరం, చిలకలూరిపేట రూపురేఖలే మారిపోయాయన్నారు. గణపవరం అభివృద్ధికి మద్ది లక్ష్మయ్య అందించిన సహాయసహకారాలు మరువ లేనివన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి తోట రాజా రమేష్, పేర్ని వీరనారాయణ, డాక్టర్ యశస్వి రమణ, బండారుపల్లి సత్యనారాయణ, నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీ ముల్లా, గంగాశ్రీనివాస రావు, జవ్వాజి మధన్ మోహన్, కెళ్ళంపల్లి ఆచయ్య, కంచర్ల శ్రీనివాసరావు, కేళ్ళంప ల్లి నరసింహారావు, వీరగంధం రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలంలో ప్రతి సోమవారం జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా జరుగు తుందని మండల తహశీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలములోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు సోమవారం ఉదయం 10.00 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, చిలకలూరిపేట వారి కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. మండలంలోని ప్రజలు ఏ శాఖకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించు కోవాలని తహశీల్దార్ పేర్కొన్నారు.

ప్రజాశక్తి పెదకూరపాడు

సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక యధావిధిగా జరుగుతుందని పెదకూరపాడు మండల తహసిల్దార్ ధనలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో రాతపూర్వకంగా అందించవచ్చు న్నారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలంలో ప్రతి సోమవారం జరుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమము యధావిధిగా జరుగుతుందని మండల తహశీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు సోమవారం ఉదయం 10.00 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, చిలకలూరిపేట వారి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. మండలంలోని ప్రజలు ఏ శాఖకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని మండల తహసిల్దార్ కోరారు.

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రతి సోమవారం క్రోసూరు మండలములో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమము క్రోసూరు తహశీల్దార్ కార్యాలయము నందు నేడు ఉదయము 10.00 గంటల నుండి యధావిధిగా జరుగుతుందని క్రోసూరు మండల తహసీల్దార్ వివి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమము నందు మండల స్థాయి అధికారులందరూ పాల్గొనుచున్నారనియు, ప్రజలు వారి యొక్క సమస్యలు గురించి పిర్యాదు చేయ దలచిన వారు అర్జీ రూపములో వారి యొక్క సమస్యలను తెలుపవలసినగా క్రోసూరు మండల ప్రజలకు తెలిపారు. ఆయా శాఖలు అధికారులు తప్పని ఈ కార్యక్రమానికి హాజరు కావాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-మంగళగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో బి13 వద్ద శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి సహకారంతో పట్టణ వికాస తరంగిణి, మహిళ ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వీఐఏ, కాల్పోస్కోపీ, పాప్ స్మియర్ తదితర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బీ ఉష, డాక్టర్ గిరిజ వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిజ మాట్లాడుతూ మహిళలకు వైట్ డిశ్చార్జ్, ఎక్కువ బ్లీడింగ్, పీరియడ్స్ రెగ్యులర్‌గా రాకపోయినా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళల్లో బ్రెస్ట్, సర్వేకల్ కేన్సర్స్ ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య వికాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పీ రుక్మిణి, జిల్లా కోఆర్డినేటర్ జె పద్మావతి, వికాస తరంగణి పట్టణ అధ్యక్షులు నందం జోగేంద్ర చక్రవర్తి, ప్రతినిధులు నందం విజయలక్ష్మి, చిన్ని విజయలక్ష్మి, శారద, జేవీ నారాయణ, గట్టు బాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చేబ్రోలు: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న పలువురు బాధితులకు పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మైలా వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాత్మక బోధనలో పరస్పర సహకారం

కార్నెజీ మెలన్, ఎస్ఆర్ఎం మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కార్నెజీ మెలన్ యూనివర్సిటీ (యూఎస్ఏ), ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీల మధ్య విజ్ఞానాత్మక విద్యాబోధన, సంయుక్త పరిశోధనలతో కూడిన అవగాహన కుదిరింది. కార్నెజీ మెలన్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్సుకు విశ్వ వ్యాప్తంగా కత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ పరిశోధనల్లో ఎంతో పేరుంది. ఇటువంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీ సహకారాన్ని పొందడం అవసరమని భావించిన ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యాబోధన, పరిశోధన రంగాల్లో సమగ్రమైన అవగాహన కుదుర్చుకుంది. దీనివల్ల కార్నెజీ మెలన్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీ, పరిశోధకులతో నేరుగా కలిసి పనిచేసే అవకాశం ఎస్ఆర్ఎంకు లభిస్తుంది. ఏపీ ఎస్ఆర్ఎంలో పరిశోధనా సామర్థ్యాలను మరింత మెరుగు పర్చుకోవడానికి ఈ అవగాహన దోహదపడుతుందని ఎస్ఆర్ఎం ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ పేర్కొన్నారు. ఈ సహకారం ఎస్ఆర్ఎంలో ఆధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లను స్థాపించడానికి కూడా మార్గం సుగమం చేస్తుందన్నారు. ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన టీచింగ్ ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్లు, కార్నెజీమెలన్లోని కత్రిమ మేధకు చెందిన కీలక కోర్సులను అధ్యయనం చేసే అవకాశం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్నెజీ మెలన్ యూనివర్సిటీ సహకారం కత్రిమ మేధ విజ్ఞానాన్ని అభివద్ధి చేసుకునే క్రమంలో కీలక మైలురాయిగా మారుతుందని వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోదా పేర్కొన్నారు.

తరలివచ్చిన యాత్రికులు

సమ్మక్క, సారక్క వార్షికోత్సవం

ప్రజాశక్తి-తుళ్లూరు: తుళ్లూరు-పెదపరిమి మధ్య తానాపతి చెరువు వద్ద సమ్మక్క-సారక్క పండుగ 16వ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాంతాల నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క-సారక్క విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కోలాటం, మ్యూజికల్ ప్రోగ్రాం అలరించాయి. భక్త కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్:

యంగ్ జనరేషన్ టీం ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణి చేశారు. సంస్థ ద్వారా ఆదివారం నలుగురు పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణి చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు సాధిక్ చెప్పారు. ఐతానగర్ ప్రాంతానికి చెందిన లింగేశ్వరరావు, అన్నారావు, మారిస్ పేటకు చెందిన సుశీల, పద్మ కుటుంబాలకు నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో సంస్థ ద్వారా మరెన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని యంగ్ జనరేషన్ సంస్థ సభ్యులు నవీన్, శివ తెలిపారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-తుళ్లూరు: ఈ నెల 16,17 తేదీల్లో గుంటూరులోని సిపిఐ కార్యాలయంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం నాయకులు మండలంలోని రాయపూడి గ్రామంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ పనుల్లేక వ్యవసాయ కార్మికులు వలస వెళ్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మంగళగిరి: భారతదేశ రైతాంగాన్ని కార్పొరేట్ కబంధహస్తాల నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సోమవారం ఉదయం పది గంటలకు గుంటూరు చుట్టగుంట సెంటర్లోని రాష్ట్ర వ్యవసాయ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులు పాల్గొనాలని కోరారు. ముందుగా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రైతు నాయకులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

రామనాథం చినకోటయ్య శివ పార్వతమ్మ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. యూనెస్కో క్లబ్ ప్రతినిధి రామనాథం పరమేశ్వర రావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మానవతా వేదిక కన్వీనర్, కవి గోలి మధు అధ్యక్షత వహించారు. దూరదర్శన్ ప్రాంతీయ వార్తావిభాగ అధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు మాట్లాడుతూ బాలురుతో సమానంగా బాలికల్ని పెంచవలసిన అవసరం ఉందన్నారు. భ్రూణ హత్యలు నివారించి బాలికలకు అన్నీ రంగాల్లో ప్రాధాన్యతనిస్తూ వారిని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేస్తున్న 15 మంది మహిళల్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పొట్లాబత్తుని లక్ష్మణరావు, వల్లభనేని వాణి, కౌతరపు కవిత, శారదా వాణి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-పెదనందిపాడు: ప్రజలందరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, పుస్తక పఠనం వల్ల మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం శాఖ గ్రంథాలయంలో చదవడం అంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులలో సమర్థవంతంగా చదివే అలవాటును పెంపొందించడానికి, విద్యార్థుల్లో పఠనాఆసక్తిని పెంపొందించేందుకు పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం ప్రత్యేకంగా చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్ మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచి, మంచి ఆలోచనలను పంచుతాయని తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని, వార్డు సభ్యులు వెలినేని శివయ్య, మేడిద రవి, ఎన్ మల్లిక, జి. మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

డిబిఎన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మంగళగిరి: ఊటీలో ట్రైబల్ కల్చర్ సెంటర్లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మంగళగిరికి చెందిన డీబీఎన్ గ్రూపు సంస్థలు చైర్మన్ దేవతి భగవన్నారాయణ సేవలను యూనివర్సిటీ గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

డాక్టర్ ఆఫ్ హ్యూమానిటీ విభాగంలో భగవన్నారాయణకు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. మాజీ మద్రాస్ హైకోర్టు జడ్జి డాక్టర్ వెంకటేష్, గవర్నమెంట్ చీఫ్ సెక్రటరీ తమిళనాడు సంపత్ కుమార్, వైస్ ఛాన్సర్ డాక్టర్ మ్యానువల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి విజయ మోహన్, దేశ విదేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధుల సమక్షంలో భగవన్నారాయణ డాక్టరేట్ అందుకున్నారు. డిబిఎన్‌కు డాక్టరేట్ రావడం పట్ల డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, స్థానిక రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

చెక్కు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన గంధం ఉమామహేశ్వరకి ముఖ్యమంత్రి సహాయనిధి 65 వేల రూపాయల చెక్కును ఆదివారం కుంచనపల్లి గ్రామం టిడిపి, జనసేన పార్టీ నాయకులు లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన గ్రామ నాయకులు పసుపులేటి అశోక్, కొవ్వూరి సురేష్, తెలుగు మహిళ గ్రామ అధ్యక్షులు దాశెట్టి అరుణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-తుళ్లూరు: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పలువురికి రూ 41.47 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్: కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జనసేన కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవంలో సైనికుల్లా పని చేయాలన్నారు. తాడేపల్లి నుంచి భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు పసుపులేటి అశోక్, ప్రధాన కార్యదర్శులు లాల్చంద్, శ్రీధర్, రమేష్,సురేష్, హనుమ, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు మేకల రాజా, శివ కోటేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

12న విజయవాడ ధర్నాను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-గుంటూరు: ఉపాధి హామీ చట్టం రక్షణ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు ఈ నెల 12న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. సమ్మర్ అలవెన్స్, పలుగు సాన పెట్టడానికి, మంచినీటికి డబ్బులు ఇవ్వట్లేదన్నారు. సమ్మర్ అలవెన్స్ 30 శాతం కలపాలని, పనిముట్లు, మంచినీళ్లకు డబ్బులు ఇవ్వాలని, మేట్లకు ప్రతి కూలిపై ఐదు రూపాయలు పారితోషికం ఇవ్వాలని, ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయకూడదని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలని, మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని, ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని, వలస కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఉచిత రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ బండ అందించాలని, ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు భీమా సౌకర్యం రూ.25 లక్షల నగదు, రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాలో ఉపాధి కూలీలు, పేద ప్రజలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, మహిళా కన్వీనర్ బి.కోటేశ్వరి, మంగళగిరి మండల అధ్యక్షులు జి.అజయ్, నాయకులు వై.భ్రమేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కళ్లం' కాలేజీ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు: కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 14వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సి.హెచ్.దినేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి తన జీవితంలో ప్రతి మార్పును గమనిస్తూ తదనుగుణంగా నిర్ణయాలు, ప్రణాళికలు రూపొందించుకొని వాటి సాధన కోసం కృషి చేయాలన్నారు. స్మార్ట్ బ్రిడ్జి హైదరాద్‌కు చెందిన శ్రీదేవి సిరా మాట్లాడుతూ సాంకేతిక విప్లవ మార్పులతో పాటు విద్యార్థులు త్వరితగతిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ప్రస్తుత ఉపాధి కల్పనకు ఉపయోగపడే అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్యా సంబంధిత సర్టిఫికెట్స్‌ను సమకూర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి కళాశాల వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.25లక్షలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పి.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్ రెడ్డి, ఏఒ కల్లం నవ్య, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పేదల అవసరాలు గుర్తించేందుకే పి-4 సర్వే

- సంక్షేమ పథకాలపై ఎటువంటి ప్రభావమూ ఉండదు
- 18 వరకు ఇంటింటికీ సచివాలయ సిబ్బంది
- గుంటూరు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ

స్వర్ణాంధ్ర-2047 దిశగా రాష్ట్ర ప్రభుత్వం పి-4 సర్వే చేపట్టిందని గుంటూరు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజలు నేరుగా తమ అభిప్రాయాలను ఆన్‌లైన్ ద్వారా వెల్లడించవచ్చని వెల్లడించారు. పి-4 సర్వే విధానంపై ఆమె 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ఇంటింటి సర్వే ఎప్పటికి పూర్తవుతుంది?

ఎంఎల్‌సి ఎన్నికల అనంతరం జిల్లాలో పి-4 విధానం అమలుకు చేపట్టిన సర్వే తిరిగి ఈ నెల 8వ తేదీ ప్రారంభమై 18వ తేదీతో ముగుస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం సర్వే నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు పలు జాబితాలను విడుదల చేసింది. ఈ జాబితా ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పేదరికంలో ఉన్నారా లేదా అన్న విషయాన్ని నమోదు చేస్తారు. ప్రస్తుతం ఉన్న జనాభాలో 20 శాతం కుటుంబాలు పేద, నిరుపేదలుగా ఉన్నారని ప్రభుత్వం అంచనా వేసింది.

పేదలు, నిరుపేదల గుర్తింపునకు ఎంపిక చేసిన నిబంధనలు?

పట్టణాల్లో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం, ప్రభుత్వ ఉద్యోగం, ఆదాయ పన్ను, జిఎస్‌సి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం కల్గి ఉండరాదు. గ్రామీణ ప్రాంతాల్లో పది ఎకరాల కన్నా తక్కువ సాగు భూమి ఉండవచ్చు. వెయ్యి అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉండవచ్చు. నిరుపేదలుగా పేర్కొన్న వారిలో విద్యుత్ కనెక్షన్లు లేని వారు, తాగునీటి ట్యాప్ లేని వారు, బ్యాంకు ఖాతా లేనివారు, టివి, ఫ్రిజ్, ఎసి, ల్యాప్ ట్యాప్, పక్కా గృహం లేనివారిని గుర్తిస్తారు. సర్వేను మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తారు.

సర్వేలో ఎవరెవరు పాల్గొంటారు?

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తారు. కుటుంబ పెద్ద ఎవరు? మొత్తం కుటుంబంలో ఎంత మంది సంపాదిస్తారు? వారి ఆదాయం, ప్రభుత్వం నుంచి పొందుతున్న సదుపాయాలను నమోదు చేస్తారు. వారికి ఉన్న వసతులు, ఆస్తులు కూడా నమోదు చేస్తారు. ఆయా కుటుంబంలో ఒకరి నుంచి బయోమెట్రిక్ లేదా ఫోన్ ఒటిపి ద్వారా సర్వే చేపడతారు.

సర్వే వల్ల సంక్షేమ పథకాలు రద్దు అవుతాయనే భయం ఉంది?

ఈ సర్వేకు సంక్షేమ పథకాలకు సంబంధం లేదు. ఆయా ప్రాంతాల్లోని పేద, నిరుపేదలను గుర్తించి వారిని ఎలా ఆదుకోవాలి? ఆర్థికంగా, సాంఘికంగా, పారిశ్రామికంగా, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పన ద్వారా వీరికి చేయూతను అందించేందుకు ప్రవాస ఆంధ్రులు, ధనికుల సహకారంతో ప్రభుత్వం తగిన ప్రోత్సాహకం అందించి వారిని ఉన్నత స్థితికి తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించనున్నారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎలక్ట్రానిక్స్ డివైజ్ తయారీలో రికార్డు

ప్రజాశక్తి-గుంటూరు: సుగుణ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సుధర్మ ఆడిటోరియంలో 'ఎలైట్ అండ్ ఎనర్జిటిక్ మైండ్స్' పేరుతో కార్ రివర్స్ చేసే సమయంలో ఉపయోగించే అలారంతో కూడిన ఎలక్ట్రానిక్ డివైజ్‌ను తయారు చేశారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌తో పాటు వెంకటకష్ణాపురంలోని సిద్దార్ధ హైస్కూల్‌కు చెందిన 6, 7, 8, 9 తరగతులు చదువుతున్న 220 మంది విద్యార్థులు ఒకే వేదికపై సామూహికంగా సర్క్యూట్ బోర్డు ద్వారా డివైజ్‌లను రూపొందించారు. సుగుణ సైన్స్ అకాడమీ సీఈవో డాక్టర్ చివుకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకుడు పత్రి వేణుగోపాల్ సారథ్యంలో విద్యార్థులకు సర్క్యూట్ బోర్డులు అందజేసి, కార్ రివర్స్ అలారంలను ప్రయోగాత్మకంగా తయారు చేయించారు. సర్క్యూట్‌బోర్డు ద్వారా అలారం రూపకల్పనకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ, ఒక్కో దశను అధిగమించి ముందుకు వెళ్లడంలో పత్రి వేణుగోపాల్, చివుకుల సాంబశివరావు విద్యార్థులకు సాంకేతిక సహకారాన్ని అందించారు. డివైజ్‌లను తయారు చేసిన విద్యార్థులు చివరి దశలో వాటికి బ్యాటరీని అమర్చి, అలారంలను మోగించారు. దీంతో సామూహికంగా 220 మంది విద్యార్థులు ఒకేసారి, ఒకే వేదికపై ఎలక్ట్రానిక్ డివైజ్ తయారు చేయడం ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారని కార్యక్రమాన్ని ఆద్యంతం పర్యవేక్షించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ బోడేపూడి రామారావు ప్రకటించారు. ఈసందర్భంగా సుగుణ సైన్స్ అకాడమీ ప్రతినిధులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ కె. శరత్‌కుమార్, కేఎల్ వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ షణ్ముఖ కుమార్, సెర్చ్ ఎన్‌జీవో సంస్థ అధ్యక్షుడు మన్నవ హనుమ ప్రసాద్, అమ్మనాన్న ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చెన్న పోతురాజు, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పాటిబండ్ల విష్ణువర్ధన్, కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డివైజ్ తయారీలో పాల్గొన్న విద్యార్థులు

నేడు గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంతో పాటు, మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవాలన్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల స్థాయిలోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి పట్టణంకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ముగ్గురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, వార్డు అధ్యక్షులు సైనాదం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ హలీమ్‌కు చిరునామా హోటల్ సుభాని

ప్రజాశక్తి-గుంటూరు: రంజాన్ మాసం సందర్భంగా గుంటూరు నగరంలో నలువైపులా హలీం పాయింట్లలో సందడి నెలకొంది. వంద శాతం పొటేలు మాంసం,

నెయ్యితో తయారు చేసే స్పెషల్ హలీమ్‌కు మాత్రం హోటల్ సుభాని కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రంజాన్ సందర్భంగా హోటల్ నిర్వాహకులు షేక్ షరీఫ్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గుంటూరు నల్లపాడు రోడ్‌లోని మిర్చి యార్డ్ వద్ద, కస్టమర్ల రిక్వెస్ట్ నిమిత్తం గుంటూరు మాయాబజార్ సెంటర్లో మెయిన్‌రోడ్‌లో మరొక బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. హలీమ్ అంటే గతంలో హైదరాబాదు లాంటి నగరాల్లోనే దొరికేదని ఇప్పుడు దానికి ధీటుగా గుంటూరు నగరంలో సుభాని హోటల్ ద్వారా నాణ్యమైన హలీమ్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఇదే కాకుండా 365 రోజులూ మటన్ దమ్ బిర్యాని, చికెన్ దమ్ బిర్యాని, ఫ్రై బిర్యాని,

కిచిడి మొదలైన నాన్ వెజ్ వంటకాలు రుచిగా తయారుచేసి కస్టమర్లకు అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా గత నాలుగు సంవత్సరాల నుంచి రంజాన్ నెల మొత్తం ముస్లింలకు ఉపవాస దీక్ష ఉండడానికి తెల్లవారుజామున ఉచితంగా సహరి ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిరోజు 400 నుంచి 500 మందికి సహరీకి వస్తున్నారని తెలిపారు.